బస్టాప్‌లు లేక అవస్థలు

పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
ప్రయాణికుల పాట్లు



దీఆర్ఎం కార్యాలయం వద్ద చెట్టు నీడలో బస్సుకోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు



అల్లిపురం బీఆర్ రెడ్డి జంక్షన్‌లో చెట్టునీడే ఆసరా చేసుకుని నిలుచున్న ప్రయాణికులు

అల్లిపురం: నగరంలోని 32, 33, 34 వార్డులతో పాటు పలు ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఎండకాలంలో బస్సుల కోసం వేచి చూసేందుకు సరైన నీడ లేకపోవడంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

ప్రధాన సమస్యలున్న ప్రాంతాలు

సౌత్ జైలురోడ్డు బీఆర్ రెడ్డి జంక్షన్ : ఇక్కడ రెండు బస్‌స్టాప్‌లు ఉన్నప్పటికీ, కేవలం చెట్ల నీడే ప్రయాణికులకు దిక్కవుతోంది.

చావులమదుం జంక్షన్: ఈ ప్రాంతంలో బస్‌స్టాప్‌లు లేకపోవడంతో ప్రయాణికులు ఎండలోనే నిల్చుని బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది.

జెండా చెట్టు ప్రాంతం: ఇక్కడ కూడా బస్‌స్టాప్ లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

పూర్ణామార్కెట్: నియోజకవర్గంలోని ఈ ప్రధాన ప్రాంతంలో బస్‌స్టాప్‌లు ఆక్రమణలకు గురవడంతో, ప్రయాణికులు మండే ఎండలోనే బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది.

జీవీఎంసీ ఆదాయం – ప్రయాణికుల కష్టాలు

జీవీఎంసీ నగరంలో బస్‌స్టాప్‌ల వద్ద బస్ షెల్టర్లను ఏర్పాటు చేసి, వాటి ద్వారా ప్రకటనల రూపంలో భారీగా ఆదాయాన్ని ఆర్జిస్తోంది. అయితే ప్రయాణికులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించే పలు ప్రాంతాల్లో కనీసం బస్ షెల్టర్లను కూడా ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



చావులమదుం వద్ద బస్ సెల్టర్ లేక రోడ్డుమీదే వేచివున్న ప్రయాణికులు

ప్రయాణికుల డిమాండ్

బస్‌షెల్టర్లు లేని చోట్ల కూడా తక్షణమే బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని, ఉన్న వాటిని ఆక్రమణల నుంచి విముక్తం చేయాలని ప్రయాణికులు జీవీఎంసీని డిమాండ్ చేస్తున్నారు. ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచడంలో భాగంగా ప్రయాణికుల కనీస అవసరాలను తీర్చాలని వారు కోరుతున్నారు.

ఎండైనా..వానైనా..

ఎండైనా..వానైనా..రోడ్డుమీదే నిల్చోవాల్సి వస్తోంది. ఎండకు, వర్షానికి నీడ లేకపోవడంతో అవస్థలు పడుతున్నాం. జీవీఎంసీ అధికారులు స్పందించి బస్ షెల్టర్లు నిర్మించాలి.

–చిన్నమ్మలు, అల్లిపురం

బస్ షెల్టర్లు నిర్మించాలి

జెండాచెట్టు వద్ద బస్ షెల్టర్‌లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే బస్ షెల్టర్లు నిర్మించాలి. దీని వలన ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉంటారు.

– ఎస్.సంజీవరెడ్డి, బంగారుమెట్ట

అవస్థలెన్నో..

బస్ షెల్టర్‌లు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అల్లిపురం ప్రాంతంలో బి.ఆర్. రెడ్డి జంక్షన్, చావులమదుం జంక్షన్, జెండా చెట్టు వద్ద బస్టాపుల్లో షెల్టర్ లేక చెట్లను ఆశ్రయిస్తున్నారు. ఆ ప్రాంతాల్లో బస్ షెల్టర్‌లు నిర్మించాలి.

– షేక్ మదీనా, యాతపేట, అల్లిపురం

సిరులతల్లికి తులసిపూజ



తులసిపూజలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు భక్తులు పాల్గొన్నారు. అలాగే అమ్మవారికి నిర్వహించిన త్రికాల పంచామృతాభిషేక సేవలో కూడా ఉభయదాతలు పాలుపంచుకున్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసిపూజలో పాల్గొనే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి కె. శోభారాణి తెలిపారు. ప్రత్యేక పూజలను పరోక్ష పద్ధతిలో నిర్వహించుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో రుసుము చెల్లించవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి కె. శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

అప్పుల బాధతో వెళ్లిపోయిన యువకుడు కుటుంబం చెంతకు..

అల్లిపురం: అప్పుల బాధలు తట్టుకోలేక సూసైడ్ నోట్ రాసి తన షాపు నుంచి వెళ్లిపోయిన యువకుడిని మహారాణిపేట పోలీసులు గుర్తించి అతని కుటుంబానికి అప్పగించారు. మహారాణిపేట సీఐ భాస్కర్ వివరాలు వెల్లడించారు. లక్ష్మీ టాకీస్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తన కుటుంబంతో నివాసముంటున్న ఓ యువకుడు, మహారాణిపేట దండుబజార్‌లోని తన ఆప్టికల్ షాపునకు వెళ్తున్నానని చెప్పి ఈ నెల 4వ తేదీన ఇంటి నుంచి బయలుదేరాడు. అయితే అతను తన షాపునకు చేరుకుని, అప్పుల బాధలు తట్టుకోలేక ఒక సూసైడ్ లెటర్ రాసి, తన మొబైల్‌ను అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో ఆందోళన చెందిన అతని భార్య మహారాణిపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, అతని ఆచూకీని కనిపెట్టారు. అనంతరం ఆ యువకుడిని సురక్షితంగా అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహారాణిపేట పోలీసు సిబ్బందిని పోలీస్ కమిషనర్, డీసీపీ-1, ఏసీపీ ఈస్ట్ అభినందించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ముస్లింలకు సముచిత స్థానం



వాసుపల్లి గణేష్‌కుమార్‌కు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ముజీబ్ ఖాన్

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ హయాంలో ముస్లింలకు సముచిత స్థానం కల్పించామని పార్టీ దక్షిణ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. బక్రీద్ పండగ సందర్భంగా శనివారం ఆశీల్‌మెట్టలోని ఆయన కార్యాలయంలో పార్టీ దక్షిణ నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు, 39వ వార్డు అధ్యక్షుడు ముజీబ్ ఖాన్ వాసుపల్లి గణేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ దక్షిణ నియోజకవర్గ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్, 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, దక్షిణ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకుల శ్యామ్, గనగల రామరాజు, వాసు తదితరులు పాల్గొన్నారు.

వాసుపల్లితో అనురాధ భేటీ



అనురాధను సత్కరిస్తున్న వాసుపల్లి

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రీసు అనురాధ, దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆశీల్‌మెట్టలోని కార్యాలయంలో వాసుపల్లికి శాలువా కప్పి సత్కరించగా, ఆయన కూడా అనురాధను ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రీసు అనురాధ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

కేజీహెచ్‌లో ప్రారంభోత్సవాలు



ఫార్మసీ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, సీపీ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: కేజీహెచ్‌లో ప్రజల సౌకర్యార్థం రూ. 23 లక్షలతో నిర్మించిన నూతన ఫార్మసీ కౌంటర్, టెస్లా సెంటర్ వద్ద రోగుల కోసం నిరీక్షణ షెడ్డు, అలాగే మార్చురీ ఆవరణలో నిర్మించిన పోలీస్ ఔట్ పోస్ట్‌ను ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, రోగుల కోసం నిర్మించిన ఈ షెడ్లు వారికి ఎంతో ఉపయుక్తమని తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖ బ్రత బాగ్చి మాట్లాడుతూ పోలీస్ ఔట్ పోస్ట్ భవనం లేకపోవడం వలన గతంలో ప్రజలు, పోలీస్ సిబ్బంది చాలా ఇబ్బంది పడేవారని తెలిపారు. ఈ పోలీస్ ఔట్ పోస్ట్ భవనాన్ని నిర్మించినందుకు సూపరింటెండెంట్ డా.పి. శివానంద, ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేజీహెచ్ పరిసరాల్లో 5 కిలోమీటర్ల పరిధిలో 24/7 డ్రోన్ల నిఘా ఉంటుందని, తద్వారా కేజీహెచ్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

కల్యాణ శోభ



ఘనంగా సీతారామచంద్రస్వామి కల్యాణం



సత్యదేవుని కమనీయ పరిణయం



పోర్టు వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవం

డాబాగార్డెన్స్: జ్యేష్ఠ శుద్ధ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని పలు దేవాలయాలు శనివారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. వార్షికోత్సవాల్లో భాగంగా పలు దేవాలయాల్లో కల్యాణోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.

ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం 8 గంటలకు నిత్య హోమాలు, వైనతేయ ప్రతిష్ఠ, ధ్వజారోహణం నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన స్వామి దివ్య తిరు కల్యాణోత్సవానికి నగరం నుంచే గాక సుదూర ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చా రు. వేద మంత్రాలు, సన్నాయి వాయిద్యాల మధ్య స్వామి కల్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. ఆలయ ఈవో టి. రాజగోపాలరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, సిబ్బంది, ఫణిహారం నరసింహమూర్తి, అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు : కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటలకు నిత్య కార్యక్రమాలు, విశేష పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు నిత్యపూజలు, హోమాలు జరపనున్నారు.

పోర్టు ఏరియాలోని శృంగమణి పర్వతంపై వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవం శనివారం సాయంత్రం 7 గంటలకు అత్యంత వైభవంగా నిర్వహించారు. విశాఖ నగరం నుండి వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు ఈ వేడుకలో పాలుపంచుకున్నారు.

నేటి కార్యక్రమాలు : కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామిని గరుడ వాహనంపై ఊరేగించనున్నారు.

కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయం వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామికి విశేష ఆరాధన, నిత్యహోమాలు, బలిహరణ నిర్వహించారు. అనంతరం ఉదయం 10:30 గంటలకు స్వామి కల్యాణోత్సవం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా, వైఖానస సాంప్రదాయ రీతిన అత్యంత వైభవంగా నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



ముస్లింలకు ఈద్ ముబారక్ తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



అంబుసరంగ్ వీధి మసీదు ప్రాంగణంలో భక్తి శ్రద్ధలతో నమాజ్ చేస్తున్న ముస్లింలు

అల్లిపురం: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ (ఖుర్బానీ పండుగ, ఈద్ అల్ అదా) పండుగను శనివారం నియోజకవర్గంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే మసీదులు, ఈద్గాల వద్దకు చేరుకున్న ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నియోజకవర్గంలోని అల్లిపురం, చలువతోట, రిజర్వ్‌లైన్, కోటవీధి, జగదాంబ దరి మక్కా మసీదు, ఏవీఎన్ కళాశాలలో గల మసీదుల వద్ద భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. ప్రవక్త ఇబ్రహీం తన కొడుకును అల్లాహ్ ఆదేశం మేరకు బలి ఇవ్వడానికి సిద్ధపడటం, ఆయన భక్తికి, త్యాగానికి గుర్తుగా ఈ పండుగను ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారని ముస్లిం పెద్దలు వివరించారు. అనంతరం ముస్లింలు తమ పెద్దల సమాధుల వద్దకు వెళ్లి ఇష్టమైన ఆహార పదార్థాలు, పూలు ఉంచి ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు, చిన్నా పెద్దా తేడా లేకుండా 'బక్రీద్ ఈద్ ముబారక్' శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

డాబాగార్డెన్స్: బక్రీద్ పండగను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలోని మక్కా మసీదు, కోటవీధి ఫుట్‌బాల్ గ్రౌండ్ ప్రాంగణం, ఫెర్రీరోడ్డు మసీదు ప్రాంగణం, పోలీస్ బ్యారెక్స్ మసీదు వంటి పలు మసీదులు, ఈద్గా వద్ద ప్రత్యేక ఈద్ నమాజ్ నిర్వహించారు. అనంతరం శాంతి ర్యాలీలు జరిగాయి. ముఖ్యంగా అంబుసరంగ్ ఈద్గా మైదానంలో ముస్లింలు పెద్ద ఎత్తున ప్రార్థనలు చేశారు. మసీదు అధ్యక్షుడు మహ్మద్ సుఫ్రత్ ఆలీఖాన్ నేతృత్వంలో, ఇమామ్ హాఫీజ్, మహ్మద్ మూతియార్ రెహ్మాన్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ప్రార్థనల అనంతరం ఖురాన్ పఠనం చేసి, ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నమాజ్ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ పాల్గొని ముస్లింలకు అభినందనలు తెలిపారు.



యాతపేట మసీదు వద్ద దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పెళ్లివారింట్లో చోరీ

పెదగంట్యాడ: మండలంలోని సీతానగరంలో ఓ పెళ్లివారింట్లో చోరీ జరిగింది. మండలంలోని సీతానగరంలో నంబారు శ్రీనివాసరావు అనే వ్యక్తి కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 5న రాత్రి అతని సోదరుడు వెంకటేష్ వివాహాన్ని అతని ఇంటి సమీపంలో ఉన్న పాఠశాల మైదానంలో నిర్వహించారు. పెళ్లి సందర్భంగా ఇంటికి తాళాలు వేయకుండా తలుపు దగ్గరగా వేసి ఉంచారు. ఇదే అదునుగా నక్లెస్, నాలుగు జతలు చెవిదిద్దులు మొత్తం మూడు తులాల బంగారం చోరీ చేశాడు. పెళ్లి వేడుక ముగించుకొని ఇంటికి వెళ్లి చూస్తే బంగారం, సెల్‌ఫోన్లు కనిపించలేదు. దీంతో ఆయన న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలి



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ

అల్లిపురం: ఏడాది గడుస్తున్నా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోమవారం దేశవ్యాప్తంగా జరిగే అఖిలభారత సమ్మెలో అంగన్‌వాడీ కార్మికులు పాల్గొనాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. సుబ్బారావమ్మ పిలుపునిచ్చారు. శనివారం జగదాంబ వద్ద సీఐటీయూ యూనియన్ కార్యాలయంలో జరిగిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమావేశంలో ఆమె ఈ మేరకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 42 రోజుల సమ్మె సందర్భంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనేక హామీలను ఆమె గుర్తు చేశారు. సమ్మె కాలంలో కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల జీతాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేస్తామని హామీ ఇచ్చారని సుబ్బారావమ్మ పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అర్బన్ ప్రాజెక్టుకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఆర్. ఈశ్వరమ్మ, అధ్యక్షులుగా శోభారాణి, ప్రధాన కార్యదర్శిగా ఎస్. తులసి, కోశాధికారిగా ఇందిర, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అన్నపూర్ణ, ఉపాధ్యక్షులుగా విజయలక్ష్మి, జాయింట్ సెక్రటరీలుగా ఎర్రయమ్మ, పార్వతి ఎన్నికయ్యారు. శివలక్ష్మి, రాధ, నజ్మా, వల్లి రాణి, పైడికొండ, కుమారి, మహాలక్ష్మి కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దేవి, బృందా, వెంకటలక్ష్మి, పద్మ, పి. మణి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్టీల్‌ప్లాంట్ కేప్టివ్ పవర్ ప్లాంట్‌కు చెందిన పంప్ హౌస్-2 సమీపంలో మొక్కలు నాటారు. వాటర్ మేనేజ్‌మెంట్ విభాగం అధికారులు చంద్ర భూషణ ప్రసాద్, బి. బైజు, కె. రవిచంద్, ఎస్. భరత్‌కుమార్, బి.పి. శ్రీకాంత్ కళ్యాఫ్, సీపీపీ-2 అధికారి విష్ణుమూర్తి, డి. శ్రీనివాసరావు చేతుల మీదుగా మామిడి, మూడు వేప, ఐదు నేరేడు, మూడు రావి, మూడు జామ, మూడు సపోటా వంటి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు పర్యావరణ పరిరక్షణకు సత్యసాయి సమితి చేస్తున్న కృషిని అభినందించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఎండలు మండుతున్నాయ్...

చలివేంద్రాల్లో డ్రమ్ములు వెక్కిరిస్తున్నాయ్!





జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన నీరు లేని చలివేంద్రాలు

విశాఖలో భానుడి ప్రతాపం మామూలుగా లేదు. గత పక్షం రోజులుగా 36 డిగ్రీల సెల్సియస్ పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నగర జీవులు నిప్పుల కొలిమిలో ఉన్నట్టు విలవిలలాడుతున్నారు. పిల్లలు, వృద్ధులు ఎండ వేడిమికి తట్టుకోలేక ఇళ్లకే పరిమితమవుతున్నారు. అయితే పూట గడవాలంటే ఎండనకా, వాననకా కష్టపడే భవన నిర్మాణ కార్మికులు, రిక్షా కార్మికులు, చిరు వ్యాపారులు, ఇతర పనుల నిమిత్తం బయటకు వచ్చే సామాన్య ప్రజలు మాత్రం ఈ భానుడి తాపానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. వీరి కష్టాన్ని చూసి పులకించిపోయిన జీవీఎంసీ, నగరంలోని పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసింది. అక్కడ వరకు బాగానే ఉంది. ఆ చలివేంద్రాలను నడిపేందుకు, సేవలందించే వారికి నెలకు రూ.6,000 జీతం కూడా ఇస్తోంది. కానీ డ్రమ్ముల్లో నీరు నింపాల్సిన జీవీఎంసీ మాత్రం ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా చలివేంద్రాల వద్ద ఉన్న డ్రమ్ములు, కుండలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దాహార్తితో విలవిలలాడుతున్న ప్రజలు గుక్కెడు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఇదిలావుండగా చలివేంద్రాలు నిర్వహిస్తున్నట్టు ప్రతి రోజూ జీవీఎంసీ సిబ్బంది రావడం ..ఫొటోలు తీయడం..వాటిని జీవీఎంసీ యాప్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతోంది. అయితే నీరు లేని చలివేంద్రాలను నిర్వహిస్తున్నట్టు స్వయంగా సిబ్బందే తప్పుతోవ పట్టిస్తుండడం విశేషం. గత నాలుగైదు రోజులుగా చలివేంద్రాలకు జీవీఎంసీ మంచినీటిని సరఫరా చేయట్లేదట. అంటే చలివేంద్రాలున్నాయి... వాటిని నిర్వహించే సిబ్బందికీ జీతం ఉంది... కానీ నీళ్లు లేవు! దీన్ని బట్టి చూస్తే, నగర ప్రజల దాహం తీర్చడంలో జీవీఎంసీ ఎంత 'చల్లగా' వ్యవహరిస్తుందో అర్థమవుతోంది.

- డాబాగార్డెన్స్/ ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



చలివేంద్రం పక్కాగా నిర్వహిస్తున్నట్టు ఫొటో తీస్తున్న జీవీఎంసీ ఉద్యోగి



కొద్దిసేపటికే చలివేంద్రంలో బోర్లించి ఉంచిన కుండలు